
పురస్కారం పొందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే, కలెక్టర్, డీఈఓ తదితరులు

న్యూస్‌రీల్

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తాం


అంతారంలో పర్యటిస్తున్న ఎస్‌ఐసీ ప్రతినిధులతో సర్పంచ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతారం గ్రామాన్ని ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎస్ఐసీతో మోడల్ గ్రామంగా మారుస్తామని ఎస్ఐసీ (సుజికి ఇన్నోవేషన్ సెంటర్) ప్రాజెక్ట్ మేనేజర్ రమ అన్నారు. మంగళవారం కంపెనీ మేనేజర్ సతోడ్, జపాన్ బృందం సభ్యులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్‌తో కలసి పెద్ద చెరువు, క్రీడాప్రాంగణాలను సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్య, రవాణా, ఉపాధి అవకాశాలు, ఇంటర్నెట్ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తామని, ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో, జపాన్‌కు చెందిన సుజికీ కంపెనీ సహకారంతో మౌలిక వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐసీ బృందం రెనో, తైసీ, ఇచిమారో, లాబీ, అవుకి, కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు చెన్నయ్య, చిరంజీవి, కృష్ణ, హమీద్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ ఫణీంద్ర

మెదక్ మున్సిపాలిటీ: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ఫణీంద్ర అన్నారు. రానున్న వినాయక చవితి పండుగ విషయమై మంగళవారం పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవ కమిటీల బాధ్యులు నిబంధనల మేరకు మండపాల నిర్వహణ చేపట్టాలని, ఇబ్బందులు లేకుండా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్, పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేష్, ఎస్ఐ పోచయ్య, మండపాల నిర్వాహకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకూ దీక్ష


దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్‌పీ, ఎంఎస్ కోఆర్డినేటర్, ఐఆర్పీ, కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్, పీటీఐలను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఏళ్లుగా పని చేస్తున్నా.. తగిన వేతనం, ఉద్యోగ భద్రత లేక మనోవేదనకు గురవుతున్నామని అన్నారు. రెగ్యులరైజ్ చేసేవరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరికి ఎస్టీయూ, యూటీఎఫ్, టీపీయూఎస్, ఎస్‌జీటీయూ సంఘాల బాధ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో స్వరూప రాణి, కవిత, పాష, గట్టయ్య, ఆంజనేయులు, రాజశేఖర్, సాయి, రాజు, ప్రతాప్, రమేష్, చందు, కవిత, శ్రీనివాస్, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన 150ఏళ్ల వృక్షం


సూరారం గ్రామంలో నేలకొరిగిన వృక్షం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో 150 ఏళ్ల నాటి మహా వృక్షం మంగళవారం నేలకొరిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూమి మెత్తబడి మర్రి వృక్షం కూలిపోయింది. గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై ఇంత కాలం దర్జాగా దర్శనమిచ్చిన చెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. ఈ సందర్భంగా సర్పంచ్ నీరజ, కార్యదర్శి నాంపల్లి వృక్షం వద్ద పూజలు నిర్వహించి, అనంతరం జేసీబీ సాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు.

సమర్థవంతంగా టెట్ నిర్వహణ

కలెక్టర్ రాజర్షిషా


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 15న నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం 9:30 నుంచి 12గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి 5గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. 21 కేంద్రాల్లో పేపర్-1, 16 కేంద్రాల్లో పేపర్-2 నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం కల్పించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష కేంద్రాల రూట్లలో ఉదయం, సాయంత్రం అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా రవాణాశాఖ అధికారి రిచర్డ్ మిర్స్, డీఈఓ రాధాకిషన్, డీటీఓ సాయిలు, ఆర్టీసీ పీఆర్ఓ రమేశ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురువు స్థానం మహోన్నతమైంది

- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: సమాజంలో ఉపాధ్యాయుడి స్థానం మహోన్నతమైందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో గురువును పోలుస్తామని, మంచి పౌరులను తయారుచేసే శక్తి ఉపాధ్యాయుడికి ఉందన్నారు. ఇటీవలే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ప్రారంభించుకున్నామని, మెడికల్ కళాశాల మంజూరైందని అన్నారు. మన ఊరు మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుడికి ప్రత్యేక స్థానం ఉంటుందని, వారు చూపిన దారిలో పయనించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జునగౌడ్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్: వరద నీటిలో నుంచి వెళుతున్న వాహనదారులు



జోరువాన

- ఘణపురం ప్రాజెక్టుకు భారీగా వరద
- మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- జలదిగ్బంధంలో ఏడుపాయల ఆలయం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

మెదక్/చిన్నశంకరంపేట(మెదక్): గడిచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లుతున్నాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 89.1 మి. మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తూప్రాన్ మండలంలో 135.4 మి.మీ, అత్యల్పంగా హవేళీఘనాపూర్‌లో 62 మి.మీ వర్షం పడింది. ఘనపురం ప్రాజెక్టు నుంచి వరద నీరు రావడంతో ఏడుపాయల ఆలయం చుట్టూ నీరు చేరడంతో ఆలయాన్ని మూసివేసి రాజ గోపురం వద్ద అమ్మవారి ప్రతిమలను ఉంచి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అటు వైపు వెళ్లకుండా పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో చిన్నశంకరంపేట మండలంలోని చెరువులకు గండిపడి పంటలకు నష్టం కలిగించాయి. మండలంలోని ధరిపల్లిలో బతుకమ్మ చెరువు తూముకు గండి పడి కట్ట కొట్టుకుపోయి నీరంతా పంట పొలాల్లోకి చేరింది. హల్దీ వాగు, కుడి చెరువు, దేవతల చెరువు, నిజాంపేట మండల చల్మెడ వాగు, చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలోని బట్ల చెరువు, రేగోడ్ మండలం కొండాపూర్ – జగిర్యాల చెరువు, కొడిపల్లి మండలం సదశివపల్లి కనికల చెరువు, పెద్దశంకరంపేట తిరుమలాయ చెరువులు వర్షానికి నిండాయి. కొడిపల్లిలోని పెద్దచెరువు అలుగు పారడంతో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పూజలు చేశారు. చిన్నశంకరంపేట మండలం సూరారం, వెల్దుర్తి మండలం ఎల్కపల్లి, మసాయిపేటలో రహదార్లపై చెట్లు విరిగి పడడంతో, మనోహరాబాద్‌లో జాతీయ రహదారి పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలు నిలిచిపోయాయి.

జాతీయ రహదారిపై వరద నీరు

మనోహరాబాద్(తూప్రాన్): మంగళవారం కురిసిన వర్షానికి పోతారం-తుపాకులపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. మనోహరాబాద్ గ్రామ ఎల్లమ్మ చెరువు అలుగు పారడంతో జాతీయ రహదారి-44పై వరద నీరు చేరింది. జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, ఆర్డీఓ జయచంద్రరెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి జేసీబీలతో కాలువలు తీయించి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. కాళ్ళకల్‌లో చెరువు నిండి నీరు ఊళ్లోకి చేరడంతో పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరింది. మండలంలో కాళ్ళకల్‌లో 137.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

నిండుకుండలా ప్రాజెక్టులు..



పాపన్నపేట(మెదక్): పొంగి పొర్లుతున్న ఘణపురం ప్రాజెక్టు

హవేళీఘనపూర్(మెదక్): మెదక్-కామారెడ్డి జిల్లాల సరిహద్దు పోచారం డ్యామ్ పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. డ్యాం అందాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తుండడంతో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మంజీరా పరుగులు

పాపన్నపేట(మెదక్): వర్షాలకు మంజీరా నది పరవళ్లు తొక్కుతోంది. సింగూరు నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో ఘణపురం ఆనకట్ట పైనుంచి నీరు ప్రవహిస్తోంది.


చిన్నశంకరంపేట మండలం ధరిపల్లిలో తెగిన బతుకమ్మ చెరువు కట్ట


హవేళీఘనపూర్(మెదక్): పోచారం డ్యామ్ మత్తడి పైనుంచి ప్రవహిస్తున్న వరద


మెదక్: మాసాయిపేటలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయం ఎదుట ప్రవహిస్తున్న వరదనీరు

ఎంపీడీఓ కింద పని చేయం

ఎమ్మెల్యేకు కార్యదర్శుల ఫిర్యాదు


ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్యదర్శులు

టేక్మాల్(మెదక్): ఎంపీడీఓ భారతి తమను మానసికంగా వేధిస్తోందని, ఆమె కింద పనిచేయబోమని టేక్మాల్ మండల పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు. మంగళవారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. వ్యక్తిగత విషయాల్లో తలదూర్చుతుందని, ఫోన్లను లాక్కొని ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా కార్యాలయం నుంచి వెళ్లిపోండి అంటూ కుర్చీలను సైతం తొలగించిందని వాపోయారు. పండుగ, పర్వదినాల్లో సిబ్బంది వాట్సాప్ గ్రూప్‌ల్లో వాయిస్ మెసేజ్‌లు పెడుతూ ఇబ్బందికి గురిచేస్తోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి.. చర్యలు తీసుకోవాలని కోరారు.

గతంలోనూ ఆరోపణలు

దశాబ్ది ఉత్సవాల్లో నిధులు కాజేసిందని, విధులు సక్రమంగా నిర్వర్తించడంలేదని ఎంపీడీఓ పని తీరుపై మండల ప్రజాప్రతినిధులు గతంలో ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులను కూడా అగౌరవ పదజాలంతో మాట్లాడుతుందని, సమయపాలన పాటించడంలేదనే ఆరోపణలున్నాయి. కాగా ఈ విషయమై ఎంపీడీఓ భారతిని వివరణ కోరగా.. కార్యదర్శులను పంచాయతీ సంబంధిత పనులు మాత్రమే చేయాలని ఆదేశాలు ఇచ్చానని, అందుబాటులో ఉండి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని చెబితే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆమె తెలిపారు.



ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్ర భారతీలో మంగళవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండలానికి చెందిన టీచర్ ప్రభాకర్, వెల్దుర్తి మండలానికి చెందిన టీచర్ రాథోడ్ ప్రతాప్‌సింగ్‌లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకుంటున్న దృశ్యాలు.

తడిబట్టలతో ప్రమాణం చేస్తా..

- నిరూపిస్తే రాందాస్ చౌరస్తాలో ముక్కు నేలకురాస్తా..
- ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

మెదక్/మెదక్‌మున్సిపాలిటీ: ఏడుపాయల దుర్గామాత చాలా పవిత్రమైన దేవత.. తప్పుచేసిన వారిని తప్పకుండా శిక్షిస్తుంది. నేను ఎలాంటి తప్పుచేయలేదు. తడిబట్టలతో ప్రమాణం చేస్తా.. తప్పు చేసినట్లు నిరూపిస్తే మెదక్ రాందాస్ చౌరస్తాలో ముక్కునేలకు రాస్తా.. అంటూ ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఏడుపాయల ఈఓపై వచ్చిన ఆరోపణలను నాపై రుద్దుతూ కొందరు ప్రతిపక్షనాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌లో నమ్మకంగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోనే సీఎం కేసీఆర్ మరోసారి టికెట్ కేటాయించారని, ఇది నచ్చని వారు కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో రామాయంపేట మండలం కోనాపూర్ సొసైటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో కూడా నాపై ఆరోపణలు చేశారని, వాటిని ఎవరూ నిరూపించలేక పోయారని స్పష్టం చేశారు. ఈఓ శ్రీనివాస్ తప్పు చేసినట్లు తేలితే అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారన్నారు. గతంలో ఏడుపాయలకు రూ.1.30 కోట్ల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం ఏడాదికి రూ.8 కోట్ల ఆదాయం వస్తుందని, ఇందుకు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ఆయనతో ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలాగౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అసలే ఖాళీలు.. ఆపై డిప్యూటేషన్లు

- స్పెషలిస్టులు లేక అందని వైద్యసేవలు
- ఇదీ.. నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితి


నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

నర్సాపూర్: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేకపోవడం, ఉన్నవారిని ఇతర చోటుకు డిప్యూటేషన్‌పై పంపడం కారణాలతో ప్రజలకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందడంలేదు. ఆస్పత్రిలో 19 వైద్యుల పోస్టులకు గాను ప్రభుత్వం 13 మందిని భర్తీ చేసింది. ఇందులో నలుగురు డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, ఇద్దరు జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు, మిగతా ఆరుగురు వైద్యులు ఉన్నారు. ఉన్నవారిలో నుంచి ఐదుగురిని డిప్యూటేషన్‌పై మరో చోటుకు తూప్రాన్ నుంచి ఓ వైద్యుడిని ఇక్కడికి పంపించారు. ఆస్పత్రిలో అనస్తీషియా, ఫోరెన్సిక్ స్పెషలిస్టును తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపగా, కంటి, ఆర్థోపెడిక్, పైథాలజీ స్పెషలిస్టులు ముగ్గురిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి మార్చారు.

వసతులు లేవనే సాకుతో..

నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో ఆపరేషన్లు, పూర్తిస్థాయిలో సేవలందించేందుకు అవసరమైన వసతులు లేవనే సాకుతో ఇక్కడి ఆర్థోపెడిక్ స్పెషలిస్టును మెదక్‌కు పంపడం గమనార్హం. వంద పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేసినా పూర్తిస్థాయి వసతులు కల్పించకుండా స్పెషలిస్టులను ఇతర చోటుకు పంపడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు వైద్యులు లేరని, మెరుగైన వైద్యం పేరిట సంగారెడ్డి, హైదరాబాద్‌కు పంపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పరీక్షలు అంతంతే..

రోగ నిర్ధారణ కోసం చేసే పరీక్షలు కూడా అంతంతమాత్రంగా సాగుతున్నాయి. కొన్ని టెస్టులను మాత్రమే చేస్తుండడం, శాంపిల్స్ సేకరించి మెదక్ జిల్లా ఆస్పత్రికి పంపించడంతో రెండు మూడు రోజుల పాటు రోగులు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల మెదక్ ఆస్పత్రిలో బయో కెమెస్ట్రీ మెషిన్ చెడిపోవడంతో ప్రైవేట్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మిషన్లకు మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొంతమంది వైద్యులను డిప్యూటేషన్‌పై మెదక్, తూప్రాన్ ఆస్పత్రులకు పంపించాం. జిల్లా మొత్తాన్ని యూనిట్‌గా పరిగణించి అవసరమైన చోట స్పెషలిస్టుల సేవలను అందిస్తున్నాం. వైద్య పరికాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తెస్తాం.

– డాక్టర్ పావని, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేటరూరల్: మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్ (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ క్రమంలో రాఖీ పండగ సందర్భంగా సొంతూరికి వచ్చాడు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేని శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించగా పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరాటే పోటీలకు..


కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీలకు గజ్వేల్ మండలం కొడకండ్లలోని ఆల్ఫా ఒమేగా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రేమ్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎండీ రెహాన్, 5వ తరగతి ఎండీ అఫ్రోజ్ ఈనెల 8, 9, 10, 11 తేదీలలో రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఖేల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరాటే కోచ్ నరేష్ పాల్గొన్నారు.

రెండో వివాహం చేసుకున్నందుకు జైలు

సదాశివపేట(సంగారెడ్డి): కట్టుకున్న భార్యతో కాపురం చేస్తూనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్న వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు మహిళ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మహేశ్‌గౌడ్ తెలిపారు. సదాశివపేట గురునగర్ కాలనీకి చెందిన మీర్జాపూర్ కృష్ణవేణితో జహీరాబాద్ గుల్షన్‌నగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మీర్జాపూర్ జగన్నాథ్‌తో మార్చి 20, 2010న వివాహం జరిగింది. వరకట్నం కింద 15 తులాల బంగారం, 50 తులాల వెండి వస్తువులతో పాటు రూ.5లక్షల నగదు ఇచ్చారు. పెళ్లి అయిన 20 రోజుల నుంచే అత్త సిద్దమ్మ అదనపు కట్నం తీసుకురావాలని కృష్ణవేణిని మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఆమెకు తోడు ఆడపడుచు భవాని, ఆమె భర్త అంజన్న, మామ రమేష్‌బాబులు తరచూ గొడవపడేవారు. హోతిబి గ్రామంలోని వ్యవసాయ భూమిని కృష్ణవేణి భర్త జగన్నాథ్‌పై చేయించాలని వేధించారు. ఈ సమయంలోనే కృష్ణవేణి గర్భవతి అయ్యి బాబుకు జన్మనిచ్చింది. అయినా భర్త, అత్తమామల్లో మార్పురాలేదు. స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టులో కృష్ణవేణి పిటిషన్ వేసింది. కేసు పెండింగ్‌లోఉండగా కులపెద్దలతో పంచాయతీ నిర్వహించారు. ఇప్పటి నుంచి బాగా చూసుకుంటామని చెప్పడంతో కేసు విత్‌డ్రా చేసుకున్న కృష్ణవేణి కాపురానికి వెళ్లింది. భర్త మద్యంకు అలవాటై ప్రవర్తనలో మార్పు రాలేదు. అనుమానం వచ్చి ఆరా తీయగా.. 2014లో శిరీష అనే అమ్మాయిని జగన్నాథ్ రెండో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై నిలదీయగా కృష్ణవేణిని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీనిపై సంగారెడ్డి మహిళ పోలీస్ స్టేషన్‌లో జూన్ 2017లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. విచారణ జరిపిన సీఐ వెంకటస్న కోర్టుకు నివేదించారు. నేరం రుజువుకావడంతో జగన్నాథ్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి షాలిని షాకెల్లి మంగళవారం తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ మహేష్‌గౌడ్ తెలిపారు.



- 1,75,719 మంది రైతులకు ప్రయోజనం
- ఇప్పటివరకు రూ.447.23 కోట్ల మాఫీ ప్రక్రియ పూర్తి

గజ్వేల్ : జిల్లాలో పంట రుణాల మాఫీ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం ముందుకు సాగుతుంది. జిల్లాలోని 175719మంది రైతులకు రూ.1360.49కోట్ల మాఫీ వర్తించింది. ఇప్పటివరకు 83116 మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల మాఫీ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో కొన్నేళ్లుగా రుణమాఫీ సమస్య కారణంగా పంటరుణాలు సక్రమంగా అందక రైతులు నానా ఇక్కట్లు పడుతూ వస్తున్నారు. మాఫీ వస్తుందనే ఆశతో రుణాలు రెన్యూవల్ చేయకపోవడం వల్ల రైతులకు కొత్త రుణాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పంట పెట్టుబడుల కోసం అన్నదాతలు ఏటా సీజన్‌లో వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంటల దిగుబడి ఆశించినంత రాక, అప్పులు తీరక అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఈ పరిస్థితి వల్ల ఏటా జిల్లాలో రుణవితరణ సక్రమంగా సాగటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన కొత్త రుణాల లక్ష్యంలో బ్యాంకర్లు 65శాతానికి మించి ఇవ్వడం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఈ క్రమంలోనే రుణమాఫీ పూర్తిచేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం రైతులకు ఊరటనిస్తుంది. 2014 ఏప్రిల్ 1 నుంచి, 2018 డిసెంబర్ 11వరకు ఉన్న రుణాలను మాఫీ చేయడానికి నిర్ణయించిన సంగతి తెల్సిందే. దీని ప్రకారం జిల్లాలో 175719మంది రైతులకు సంబంధించి రూ.1360.49కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. ఇందులో ఇప్పటివరకు 83116మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల రుణాలను మాఫీ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. ఇందులో 75362మంది రైతులకు సంబంధించిన రూ.401.86కోట్ల రుణమాఫీ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన 7754 మందికి చెందిన రూ.45.37కోట్ల రుణమాఫీ మొత్తాన్ని జమ చేయడానికి ఎకౌంట్ క్లోజ్, బ్లాక్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలు ఉండగా, వాటిని సరిచేసే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.10లక్షల వరకు రుణమాఫీ వర్తింపజేస్తూ రైతులను రుణ విముక్తుల్ని చేస్తున్నారు.

వంద శాతం లక్ష్యం చేరుకునేదెప్పుడు?

జిల్లాలో వర్తించిన రుణమాఫీలో ఇప్పటివరకు 33శాతం వరకు పూర్తిచేసిన అధికారులు వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటేనే రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరనుంది. ఇకపోతే ఎకౌంట్ క్లోజ్, బ్లాక్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలతో కొందరు రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. బ్యాంకర్ల చుట్టూ తిరిగినా సరైన సమాధానం రాక ఇబ్బందిపడుతున్నా రు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు మాఫీ వర్తిస్తుందా..? లేదా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. గ్రామం యూనిట్‌గా తీసుకొని రుణమాఫీ పూర్తి చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలోకి బ్యాంకర్లు సక్రమంగా వెళ్లక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాల్సిన అవసరమున్నది.

నిర్దేశించిన గడువులోగా రుణమాఫీ పూర్తి చేస్తాం

ప్రభుత్వం మరో నెల రోజుల్లో వందశాతం రుణమాఫీ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా బ్యాంకర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. రుణాలు ఇప్పటికే చెల్లించిన రైతులు తమ అకౌంట్లతో రుణమాఫీ మొత్తం పడినట్లుగా మెసేజ్‌లు వస్తే ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ తీసుకెళ్లి బ్యాంకర్ల చూపించి ఆ డబ్బులను డ్రా చేసుకోవచ్చు. – **లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్**

భార్య మృతికి కారకుడైన భర్తకు ఏడేళ్లు జైలు

సిద్దిపేటకమాన్: వరకట్న వేధింపులకు భార్య ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. తొగుట మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన పోతుల బాబుతో కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన రజితతో 2014 మార్చి, 22న వివాహం జరిగింది. ఆ సమయంలో బంగారం, వెండి, ఇతర కట్న కానుకలు ఇచ్చారు. పెళ్లి అయిన కొన్నిరోజుల తర్వాత అతడు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసి, తర్వాత దుబాయికి వెళ్లి ఒక సంవత్సరం ఉండి వచ్చాడు. తర్వాత అదనపు వరకట్నం కావాలని రజితను శారీరకంగా, మానసికంగా వేధించాడు. పెద్దల సమక్షంలో రాజీ కుదర్చడంతో సిద్దిపేటలో నివాసం ఉన్నారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రజిత 2017 మార్చి 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి అల్లుడు బాబు కారణమంటూ మృతురాలి తల్లి సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ నర్సింహారెడ్డి కేసు పరిశోధన చేపట్టి నేరస్తుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పూర్తి పరిశోధన అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అప్పటి నుంచి విచారణ చేసిన అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్ కోర్టు జడ్జి టి.రఘురాం ఇరువురి వాదనలు విన్న తర్వాత బాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సిద్దిపేట ఏసీపీ తెలిపారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి, గృహిణి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.13 లక్షలు, ఓ గృహిణి 1.64 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని ఆర్‌ఆర్ హోమ్స్ కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 23వ తేదీన పార్ట్‌టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 13లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన గృహిణికి ఆగస్టు 22వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. అందులో ఆమె వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. దాంతోపాటు మొత్తం రూ. లక్షా 64 వేలు ఇన్వెస్ట్ చేసింది. చివరికి తాను పెట్టిన డబ్బుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తులు


కొమురవెల్లిలో పర్మిషన్ లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

- కొమురవెల్లిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు
- జీప్లస్ టూకు పర్మిషన్.. నిర్మాణం జీప్లస్ ఫోర్
- మామూళ్ల మత్తులో గ్రామపంచాయతీ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో వసతి గదులకు భలే డిమాండ్ ఉంటుంది. దీంతో కొందరు బడా బాబులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు ఇల్లు నిర్మించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు చూపి కొర్రీలు పెట్టే పంచాయతీ అధికారులు బహుళ అంతస్తుల జోలికి పోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో జీ ప్లస్ టూ నిర్మాణానికి మాత్రమే అవకాశం ఉంది. ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టాలంటే డీటీపీసీ నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పంచాయతీ అధికారులు అడ్డగోలుగా జీ ప్లస్ టూకు పర్మిషన్ ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించి కొందరు జీ ప్లస్ ఫోర్ వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామంలో గతంలో సెట్ బ్యాక్ చేయలేదని సామాన్యురాలి బిల్డింగ్‌ను గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఇప్పుడు కొందరు పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మా ణం చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లోకేష్ రెడ్డిని వివరణ కోరగా.. గ్రామ పంచాయతీలో అనేక పనులు ఉన్నా యని , ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలుండవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

విచారణ చేపడుతాం

కొమురవెల్లిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న విషయం ఇప్పుడే తెలిసింది. రెండు మూడు రోజుల్లో విచారణ చేపటి చర్యలు చేపడుతాం. గ్రామ పంచాయతీల్లో జీ ప్లస్ టూకే పర్మిషన్ ఉంటుంది.

– దేవకీ దేవి, జిల్లా పంచాయతీ అధికారి

గ్రౌండ్ ఇలా.. ఆడేదెలా?


బురదమయమైన ఫుట్‌బాల్ గ్రౌండ్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఇదే ఆవరణలో ఆర్‌టీఏ కార్యాలయం ఉండడంతో వివిధ రకాల లైసెన్సులు, అనుమతుల కోసం వచ్చే వాహనాలను ఈ గ్రౌండ్‌లోనే ట్రయల్స్ నిర్వహిస్తుంటారు. దీంతో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయిందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 1 నుంచి 13వ తేదీ వరకు సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ నేషనల్ క్యాంప్(శిక్షణ శిబిరం) కొనసాగుతుంది. వాహనాల ట్రయల్స్‌తో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రౌండ్ పూర్తిగా బురదమయమై చిత్తడిగా మారిందని వాపోయారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి క్రీడాకారులకు అనువుగా ఉండేలా ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

వర్షాలతో వరికి తెగుళ్లు

- సీనియర్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శోభ



నర్సాపూర్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పంటకు అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండు తెగులు, ఉల్లి కోడు తెగులు, మోగి పురుగు లేదా సిగపురుగు తెగులు తో పాటు ఆయా రకాల తెగులు సోకే అవకాశం ఉందని నర్సాపూర్ మండలం నత్నయ్యపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శోభ బుధవారం తెలిపారు. ప్రధానంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు మూడు లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తున్నట్లు చెప్పారు. భారీగా కురుస్తున్న తెలిపారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటిస్తూ పంటను కాపాడుకోవాలని అన్నారు. తెగుళ్ల నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో ఆమె వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ ప్లస్ మాన్కోజబ్ కలిపిన మందు 2.5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటమైసిన్ గ్రాములు 10 లీటర్స్ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉల్లికోడు నివారణకు పిప్రో నిల్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మోగి, సిగ పురుగు నివారణకు క్లోరాంత్రానిలిప్రోల్ గుళికలను నాలుగు కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు ఒక ఎకరానికి చొప్పున వేసుకోవాలి. మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు నేరుగా అవకాశం లేకుంటే ఫోన్ నంబర్ 9963468360 ద్వారా సంప్రదించి వాట్సాప్, వీడియోల ద్వారా వరికి సోకిన తెగుళ్ల సమస్యకు పరిష్కారం తెలుసుకోవచ్చని శాస్త్రవేత్త శోభ తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సెలెస్టియల్ హైస్కూల్ (ఇంగ్లిష్) బెస్ట్ టీచర్ షీమాఫర్వీన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఆర్టీసీ కండక్టర్..


అరిగె సాయిలు (ఫైల్)

హవేళీఘనపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని నాగాపూర్ గ్రామానికి చెందిన చాకలి అంజయ్య(50) మెదక్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం రాత్రి 12గంటలకు డ్యూటీ ముగించుకొని స్వగ్రామం నాగాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. హవేళీఘనపూర్ దాబా వద్ద ఎల్లారెడ్డి నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...

చేగుంట(తూప్రాన్): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రెడ్డిపల్లి శివారులోని 44వ జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలవకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రామాయంపేట మార్చురీకి తరలించినట్లు ఏఎస్‌ఐ రవీందర్ తెలిపారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

పడుకున్న చోటే వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించి పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన కేవీఎస్పీఎల్‌ఎన్ ఆచార్య(44) పదిరోజుల క్రితం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామ పరిధిలో ఉన్న ఉపేందర్ ఫామ్‌హౌస్‌లో పనికి చేరాడు. ఈ క్రమంలో ఆచార్యకు ఫామ్‌హౌస్ యజమాని ఉపేందర్ సోమవారం ఫోన్ చేయగా తీయలేదు. అనుమానం వచ్చి చూడగా పడుకున్న చోటే ఆచార్య మృతిచెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి జయప్రకాశ్ ఆచార్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, పాల్గొన్న అధికారులు

సిద్దిపేటకమాన్: ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో లిస్టు అవుట్ చేసిన కేసుల్లో సంబంధిత కక్షిదారులను పిలిపించి డిస్పోజల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీలు లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, అడ్మిన్ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సీఐలు, ఎస్‌ఐలు, రైటర్లతో రోడ్డు ప్రమాద కేసుల్లో నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ వాహనాల రూల్స్ గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద కేసులు జరిగినప్పుడు నూతనంగా ప్రవేశపెట్టిన ఫామ్ 1 నుంచి 10వరకు అన్ని వివరాలు పొందుపరిచి, ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి సరైన సమయంలో పంపించాలని సూచించారు. దీంతో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఇరువురికి సత్వర న్యాయం జరుగుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. నూతన టెక్నాలజీ 2.0 వెర్షన్‌లో ఎఫ్ఐఆర్, సీడీఎఫ్, ఇతర అన్ని వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో నూతన మోటార్ వాహనాల నిబంధనల గురించి ట్రాఫిక్ పోలీసు అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.